‘చెత్త’శుద్ధి కరవాయె!

మారుమూల గ్రామాలు కూడా జగనన్న స్వచ్ఛ సంకల్పంతో పరిశుభ్రంగా మారుతున్నాయి. పారిశ్రామిక వాడగా పేరొందిన గాజువాకలోని కొన్ని ప్రాంతాలు మాత్రం అపారిశుధ్యానికి ఆలవాలంగా మారాయి. జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బంది నిర్లక్ష్యంతో చెత్తాచెదారాలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతోంది.

- గాడి తప్పిన పారిశుధ్య నిర్వహణ
- ఎక్కడికక్కడే కుప్పలుగా చెత్తలు
- రోడ్ల పక్కనే భవన నిర్మాణ వ్యర్థాలు


87వ వార్డు సిద్ధార్థనగర్ శ్మశానవాటిక పక్కన చెత్తాచెదారంతో ఉన్న రోడ్డు


చెత్తాచెదారంతో వుడా ఫేజ్‌-7లోని ప్రధాన కాలువ


రోడ్డు పక్కన డంప్ చేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ గాజువాక జోన్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పింది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు పేరుకుపోయి వీధులన్నీ దుర్గంధభరితంగా మారాయి. జోన్ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్య పరిస్థితులు మరీ దారుణంగా ఉన్నాయి. రోజుల తరబడి చెత్తను తరలించకపోవడమే కారణమని స్థానికులు ఆక్షేపిస్తున్నారు.

దుర్గంధం.. రోగాల భయం

వీధుల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగట్లేదు. చాలా చోట్ల రోజుల తరబడి చెత్తలు పేరుకుపోవడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ చెత్త నిల్వల్లో పందులు, కుక్కలు చేరి పరిసర ప్రాంతాలను చెత్తాచెదారంగా మార్చేస్తున్నాయి. కాలువల్లో కూడా పూడికలు తొలగించక, మురుగునీరు నిలిచిపోతోంది. దీంతో దోమలు పెరిగి రోగాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా 86, 87 వార్డుల్లోని పలు ప్రాంతాల్లోనూ, ఫకీర్‌టకియా జంక్షన్‌లోనూ పారిశుధ్యం లోపించడంతో వీధులన్నీ చెత్తాచెదారంతో నిండిపోతున్నాయి. అసలే ఇరుకు రోడ్లు. ఆపై ఇరువైపులా చెత్తపోగులతో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బంది కలుగుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఇక్కట్లకు ఇవి కూడా కారణమవుతున్నాయి.

వేసవిలోనే ఇలా ఉంటే..

సాధారణంగా వేసవిలో పారిశుధ్య నిర్వహణపై పెద్దగా ఫిర్యాదులుండవు. మురుగు కాలువలు కూడా చాలా వరకు ఎండిపోయి ఉంటాయి. అందుకే తర్వాత వచ్చే వర్షాకాలానికి వేసవిలోనే అధికారులు సన్నద్ధమవుతారు. కాలువల్లో పూడికలు తొలగింపు, కాలువల పునరుద్ధరణ తదితర పనులు చేపడతారు. అయితే వేసవిలో అధికంగా జరిగే భవన నిర్మాణాలతో.. నిర్మాణ వ్యర్థాల(డెబ్రిస్)కు రోడ్లు, కాలువలే నిలయాలవుతున్నాయి. అర్ధరాత్రుళ్లు డెబ్రిస్‌ను ఎవరూ చూడకుండా రోడ్లు పక్కన, కాలువల్లో వేస్తున్నారు. దీన్ని నియంత్రించాల్సిన జీవీఎంసీ యంత్రాంగం నిర్లిప్తత కూడా ఇలాంటి వాటికి అవకాశమిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇపుడే ఇలా ఉంటే.. రానున్న వర్షాలకు కాలువల్లో చెత్త, రోడ్లపైకి చేరి సమీప నివాసాల్లో ఉన్నవారు భరించలేని స్థాయికి ఇబ్బందులు పెరిగే అవకాశముంది.

దుర్వాసన భరించలేకపోతున్నాం

చెత్తకుప్పల నుంచి వస్తున్న దుర్వాసన భరించలేకపోతున్నాం. తరచూ వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నాం. చెత్తను తరలించాలని పలు మార్లు ఫిర్యాదు చేసినా అధికారుల్లో మాత్రం చలనంలేదు. వెంటనే చెత్తను తరలించాలని కోరుతున్నాం.

– డి.శ్రీను, కూర్మన్నపాలెం

వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు

ఫకీర్‌టకియా, సిద్ధార్థనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా చెత్తచెదారంతో నిండిపోయింది. ఆ మార్గంలో ప్రయాణించడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చెత్తాచెదారంతోపాటు భవన నిర్మాణ వ్యర్థాలను కూడా ఇక్కడే డంప్ చేస్తున్నారు. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలి.

–దుగ్గపు దానప్పలు, కాళింగ వీధి, 87వ వార్డు

ప్రణాళికలు సిద్ధం చేశాం

వ్యర్థాల తరలింపునకు ప్రణాళికలు సిద్ధం చేశాం. రోడ్డు పక్కన వ్యర్థాలను వేస్తున్నవారిపై చర్యలు తీసుకునేలా టౌన్‌ప్లానింగ్ సిబ్బందికి నివేదించాం. డ్రైనేజీలను కూడా శుభ్రం చేసేందుకు యంత్రాలను ఏర్పాటు చేస్తున్నాం. వీలైనంత వేగంగా పారిశుధ్య సమస్యల్ని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.

– ఎస్.సంతోష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, 86వ వార్డు

క్లుప్తంగా

హాజీల ఏర్పాట్ల కమిటీ కన్వీనర్‌గా ఇమ్రాన్


మహ్మద్ ఇమ్రాన్

గాజువాక: విమానాల్లో హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు తగిన ఏర్పాట్లు చేసేందుకు ఏర్పాటైన కమిటీ కన్వీనర్‌గా 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటికే రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా ఉన్న విషయం తెలిసిందే. వచ్చే నెల 7 నుంచి 19 వరకు హజ్ యాత్రకు వెళ్లే హాజీలకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు హజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏడు ఉప కమిటీలను ఏర్పాటు చేశారు. అందులో విమానాశ్రయంలో యాత్రికుల ఏర్పాట్ల కోసం ఆరుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కమిటీకి ఇమ్రాన్‌ను కన్వీనర్‌గా నియమించారు.

నామాల సేవలు మరువలేనివి


సంస్మరణ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

పెదగంట్యాడ: రాజకీయ రంగంలో నామాల పెంటయ్య సేవలు మరువలేనివని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఇటీవల మృతిచెందిన నామాల పెంటయ్య సంస్మరణ సభను సోమవారం పెదగంట్యాడలో నిర్వహించారు. నామాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవల్ని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్ కాకి గోవింద్‌రెడ్డి, మంత్రి రాజశేఖర్, పులి వెంకట రమణారెడ్డి, నీరుకొండ రామచంద్రరావు పాల్గొన్నారు.

గణిత సూత్రాలపై శిక్షణ


గణితంపై శిక్షణ ఇస్తున్న గ్రంథాలయాధికారి

పెదగంట్యాడ: సూత్రాలపై పూర్తి అవగాహన ఉంటే గణితం సులభంగా ఉంటుందని పెదగంట్యాడ గ్రంథాలయ అధికారి పీవీ రమణ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం గణిత సూత్రాలపై శిక్షణ ఇచ్చారు. పరుగు పందేలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితం అంటే భయపడతారని, మౌలిక సూత్రాలను నేర్చుకుంటే, అన్ని సబ్జెక్టుల కంటే గణితమే సులభమైనదని తెలిపారు.

మొరాయించిన ఓపెన్ జిమ్ పరికరం


పని చేయని పరికరం

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కు ఆవరణలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లో ఓ పరికరం వారం నుంచి పని చేయడం లేదు. గతేడాది జీవీఎంసీ అధికారులు ఇక్కడ వాకింగ్ పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేశారు.దీంతో వాకర్స్‌తో పాటు మహిళలు రోజూ వాకింగ్ చేసి,వ్యాయామం చేసుకునే వారు. అయితే పొట్టభాగంలో కొవ్వు తగ్గించే పరికరానికి ఉన్న నట్లు పోవడంతో ఆ పరికరం మొరాయించింది.అధికారులు స్పందించి పరికరాన్ని వినియోగంలోకి తేవాలని వాకర్స్ కోరుతున్నారు.

పరమేశ్వరుడికి విశేష పూజలు

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమా చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులు తరలివచ్చి స్వామిని బిల్వపత్రాలతో పూజించారు.

ప్రతి వార్డులోనూ సంక్షేమం, అభివృద్ధి


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: నియోజకవర్గంలోని ప్రతి వార్డులోనూ ప్రజా సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేశామని గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన 73వ వార్డు, నెహ్రూనగర్ సచివాలయం పరిధిలో ఇంటింటికీ తిరిగారు. స్థానికులను కలుసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్టు తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలకు అతీతంగా సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని కొనియాడారు. భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ పథకాలను అందించేందుకు జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ రెడ్డి జగన్నాథం, నాయకులు, సచివాలయ కన్వీనర్లు, వార్డు వలంటీర్లు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు.

29 నుంచి పంచాయతన ఆలయ వార్షికోత్సవాలు


ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు

పెదగంట్యాడ: మండలంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ సమీపంలో వేంచేసిన వాసవీ కన్యకా పరమేశ్వరి పంచాయతన ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 29 నుంచి 31 వరకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ఆవరణలో ఉత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రతినిధులు మెగలపల్లి త్రిమూర్తులు, ముమ్మిడిశెట్టి ముత్యాలశెట్టి మాట్లాడుతూ 29న పంచాయతన దేవతలకు అభిషేకం, అలంకరణ, మండపాలకి పుష్ప పూజ, 30న అమ్మవారికి పంచామృతాభిషేకం, శ్రీచక్ర నవవర్ణార్చన, 31న పార్వతీపరమేశ్వరుల కల్యాణం, అన్నసమారాధన, సాయంత్రం పరస నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి రాజశేఖర్, కులుకూరి మంగరాజు, కొల్లా అప్పలరాజు, బొండాడ వెంకటేష్, మంత్రి శంకరనారాయణ, సత్యనారాయణ, కుమార్, గోపి, రామారావు, రాజశేఖర్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


830వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలో ఉన్న పరిశ్రమలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించకుండా ప్రభుత్వరంగ సంస్థలుగా నడిపేలా కార్మికులు తమ పోరాటాల ద్వారా కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 830వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ కంపెనీలకు తాకట్టు పెడుతూ, విదేశాల నుంచి పెట్టుబడులను ఆహ్వానిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల్ని మోసం చేయడం సరికాదన్నారు. కార్మికుల బలిదానాలతో సిద్ధించిన పరిశ్రమలను కాపాడుకుంటే, దేశానికి మేలు చేసినట్లేనన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యల పరిష్కారానికి వినతి


వినతి పత్రం అందిస్తున్న ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు

గాజువాక: భెల్ హెచ్‌పీవీపీ ఎస్సీ, ఎస్టీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంస్థ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు భెల్ హెచ్‌పీవీపీ యూనిట్ హెడ్ ఎంవీఎస్ఎన్ రాజుకు సోమవారం వినతి పత్రం అందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొల్లి దేముడు ఆధ్వర్యంలో యూనిట్ హెడ్‌ను కలిసి సమస్యలను వివరించారు. త్వరలో నిర్వహించనున్న భెల్ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల తరువాత, అసోసియేషన్ ఎన్నికలను నిర్వహించాలని కోరారు. డీ గ్రేడ్ అయిన తమ అసోసియేషన్ సభ్యులకు గ్రేడ్ లిఫ్ట్ చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కార్మికులకు ప్రమోషన్లలో ప్రాధాన్యత, క్వార్టర్లను కేటాయించాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో అసోసియేషన్ నాయకులు జి.చంద్రశేఖర్, కె.ప్రసాదరావు, పి.విశ్వాసరావు, కె.సుధాకర్ బాబు, రుక్‌మగ్‌థర్ ప్రసాద్, కె.శ్రీనివాసరావు, కె.ఆర్.కె.దాస్ తదితరులున్నారు.

భూ కబ్జాపై ఫిర్యాదు


ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమి

అగనంపూడి: గాజువాక మండలం, అగనంపూడి రెవెన్యూ పరిధి డొంకాడ నిర్వాసిత కాలనీలో ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోడానికి చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవాలని గాజువాక తహసీల్దార్‌కు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. సర్వే నెం.208 పార్టు 2లో ఎన్టీపీసీ ట్రాక్‌ను ఆనుకుని రెండు రోజుల క్రితం ఇద్దరు వ్యక్తులు పొక్లెయినర్లతో స్థలాన్ని చదును చేసినట్టు తెలిపారు. వీటిని ప్లాట్లుగా విభజించి విక్రయించేందుకు రంగం సిద్ధం చేశారని పేర్కొన్నారు. ఆక్రమణలను అడ్డుకుని ప్రభుత్వ భూమిని సంరక్షించాల్సిందిగా గ్రామస్తులు విన్నవించారు. గతంలో కూడా ఇదే వ్యక్తులు ఆక్రమణలను పాల్పడితే అప్పటి తహసీల్దార్ అడ్డుకున్నట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు.

టోల్‌గేటు తొలగింపునకు వినతి


ఎంపీ జీవీఎల్ నరసింహారావుకు వినతిపత్రం అందిస్తున్న అగనంపూడి నాయకులు

అగనంపూడి: జీవీఎంసీ గాజువాక జోన్ పరిధిలోని వాహనచోదకులు, ప్రయాణికులపై భారం పడుతున్న అగనంపూడి టోల్‌ప్లాజాను వెంటనే తొలగించాలని స్థానిక ప్రజా సంఘాల నాయకులు రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావును వినతిపత్రంలో కోరారు. గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు సారథ్యంలో ఆయన్ని కలిసిన నాయకులు, టోల్‌ప్లాజా తొలగింపుపై గతంలో కేంద్ర పాలకులతోపాటు, ఎన్‌హెచ్ఏఐ అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అనకాపల్లి సమీపంలో టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత దీన్ని తొలగిస్తామని చెప్పి, ఇప్పుడు పట్టించుకోవట్లేదని వినతిలో పేర్కొన్నారు. ఎంపీని కలిసిన వారిలో రైల్వే కన్సల్టెంట్ కమిటీ సభ్యుడు కొలిపాక అప్పారావు, రజక సంఘం అధ్యక్షుడు తోకాడ రాము తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిక్షణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో వేసవి క్రీడా శిక్షణ శిబిరం ఏర్పాటు చేసినట్టు 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరం మంగళవారం నుంచి జూన్ 5 వరకు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు కొనసాగనుందన్నారు. ఉక్కు స్టేడియంలో బాస్కెట్ బాల్, సెక్టార్-9 జగన్నాథస్వామి దేవాలయం ఆవరణలో కరాటే, త్రిష్ణా మైదానంలో బాక్సింగ్‌పై శిక్షణ జరుగుతుందన్నారు. శిక్షణలో పాల్గొనే వారికి గుడ్లు, పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. విద్యార్థులు, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కాలనీ సమస్యలపై సర్వసభ్య సమావేశం


సమస్యలపై చర్చిస్తున్న సిద్ధార్థనగర్ కాలనీ మెయింటెనెన్స్ కమిటీ సభ్యులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు పరిధి సిద్ధార్థనగర్ పార్కులో స్థానిక కాలనీ సమస్యలపై సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కాలనీ మెయింటెనెన్స్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. మున్సిపల్ వాటర్ సరైన సమయానికి రాకపోవడం, వీధిలైట్లు వెలగక పడుతున్న ఇబ్బందుల పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని కాలనీ పెద్దలు తెలిపారు. కార్యక్రమంలో కాలనీ మెయింటెనెన్స్ పెద్దలు బలిరెడ్డి నాగేశ్వరరావు, జె.ఎస్.మూర్తి, ఆర్.శంకర్‌నాయక్, సుందరమూర్తి, టి.సత్యానారాయణ, కృష్ణనాయక్, రాజ్‌కుమార్, ఆదినారాయణ, దాలయ్య తదితరులు పాల్గొన్నారు.

వార్డు సమస్యలపై కమిషనర్‌కు వినతి


86వ వార్డు సమస్యలపై కమిషనర్‌కు వివరిస్తున్న కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులో నెలకొన్న ప్రజాసమస్యలపై ఆ వార్డు కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించారు. వార్డులో మంచి నీటి పైప్‌లైన్లు దెబ్బతిని, త్రాగునీరు వృధాగా పోతోందని, వాటి స్థానంలో కొత్తవి అమర్చాలని కోరారు. రాసాలమ్మకాలనీ, ఇతర కాలనీల్లో మంచి నీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయని, దీంతో వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వాటి పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులకు వెంటనే సమస్యలను గురించి వివరించి పరిష్కార దిశగా చర్యలు చేపడతానని హామీ ఇచ్చినట్టు కార్పొరేటర్ తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో బొడ్డ రమణ, టీ.వీ.నాయుడు, రాజాన నాయుడు తదితరులున్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం


పురస్కారాలను అందిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

గాజువాక: టెన్త్ నుంచి పీజీ వరకు ఉత్తమ మార్కులతో ప్రతిభ కనబరచిన పలువురు విద్యార్థులకు వాసవీ సేవా ట్రస్టు నిర్వాహకులు సోమవారం ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. స్థానిక వాసవీ మాత ఆలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టపడి చదువుకునే ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వాసవీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక చైర్మన్ నంబూరి జగన్నాథరావు, నాయకులు కులుకూరి మంగరాజు, కేసారపు శ్రీను రమేష్, శరత్‌చంద్ర గుప్త, కేసారపు సతీష్, పూసర్ల జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

సేవలకు గుర్తింపు

సింథియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్ సచివాలయం (1086348)లో క్లస్టర్‌-13 వలంటీర్ విజయ్‌కుమార్ సేవలకు గుర్తింపు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం సేవారత్న అవార్డు ప్రకటించింది. ఈ మేరకు సోమవారం సచివాలయ అడ్మిన్, కార్యదర్శులు విజయ్‌కుమార్‌కు బ్యాడ్జి, ధృవీకరణ పత్రం అందజేసి శాలువాతో సత్కరించారు. క్లస్టర్‌లో అర్హులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేయడంతో విజయకుమార్ పనితీరు అమోఘమని పలువురు అభినందించారు. సీఎం జగనన్న ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలవడంలో వలంటీర్ల పాత్ర ఎనలేనిదని కొనియాడారు.

నూతన వేతనాలకు వినతి


ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డిని కలిసిన యువ కార్మికులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు నూతన వేతనాల అమలుకు సహకరించాలని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డిని స్టీల్‌ప్లాంట్ యువ కార్మికులు కోరారు. సోమవారం హైదరాబాద్‌లోని సంజీవరెడ్డి నివాసంలో ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. నూతన వేతనాలు అమలు కాక, యువ కార్మికులు పడుతున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఈ అంశంలో యాజమాన్యంపై ఒత్తిడి తెస్తే పని జరుగుతుందని సంజీవరెడ్డి సూచించగా స్టీల్‌ప్లాంట్‌లో జరుగుతున్న పరిణామాలను ఆయనకు వివరించారు. త్వరలో ఢిల్లీ వెళ్లి కేంద్ర ఉక్కు మంత్రి, కేంద్ర ఉక్కు కార్యదర్శి, స్టీల్‌ప్లాంట్ సీఎండీతో చర్చించి తన వంతు కృషి చేస్తానని భరోసా ఇచ్చినట్టు వారు తెలిపారు. సంజీవరెడ్డిను కలిసిన వారిలో జె్రిపోతుల మోహన్‌కుమార్, కోరాడ వెంకటరావు, వి.ఎస్.ఎన్.రాజు, బుదిరెడ్డి అప్పారావు, నీల్తాటి రాజు తదితరులున్నారు.

పెంటమాంబ.. చల్లగ చూడమ్మా


దర్శనానికి బారులు తీరిన భక్తులు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు హిమాచల్ నగర్ గ్రామదేవత పెంటమాంబ తల్లి మారువారం పండగను గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఆలయ అర్చకులు పసుపు,కుంకమలతో అర్చన చేసి సుగంధమాలలు,ఆభరణాలు అలంకరించి పూజలు చేశారు. పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నమ్మి గౌరీశ్వరరావుయాదవ్, నాయకులు రామ్మోహన్‌నాయుడు,జి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.అమ్మవారిని దర్శించుకునేందుకు హిమాచల్‌నగర్ ప్రాంతానికి చెందిన భక్తులు బారులు తీరారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించారు.

రాష్ట్రపతికి ఫిర్యాదుతో కదలిన అధికారులు

అగనంపూడి: ఉక్కు ఉద్యోగి ఎస్.తాతారావు మరణంపై రాష్ట్రపతికి ఫిర్యాదు చేయడంతో వివిధ శాఖల అధికారులు చర్యలకు ఉపక్రమించారని సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామఅప్పారావు సోమవారం మీడియాకు తెలిపారు. తాతారావు విధి నిర్వహణలో ఉండగా 2017లో మరణించాడని, అప్పట్లో మృతుని పోస్టుమార్టం నివేదికను కూడా పట్టించుకోకుండా అధికారులు తాతారావు కుటుంబానికి అన్యాయం చేసినట్టు పేర్కొన్నారు. ఉక్కు యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో రాష్ట్రపతికి ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు. దీంతో విచారణ చేపట్టడానికి డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌ను నియమించారని తెలిపారు.

దేవస్థానం బంకుల్లో చిల్లర సమస్య

సింహాచలం: దేవస్థానం బంకుల్లో వినియోగదారులు పెట్రోల్, డీజిల్ కొట్టించుకుని రూ.2 వేల నోటు ఇవ్వడంతో చిల్లర సమస్య తలెత్తుతోందని దేవస్థానం పెట్రోల్ బంకుల పర్యవేక్షణ అధికారి పద్మనాభరాజు సోమవారం తెలిపారు. ఇక మీదట రూ.1500కు పైగా పెట్రోల్, డీజిల్ కొట్టించుకున్న వారి నుంచే రెండు వేల నోటు తీసుకుంటామని తెలిపారు. చిల్లర సమస్య తలెత్తుతుండడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నామని, వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ముగిసిన వేసవి క్రీడా శిబిరం


చిన్నారికి బ్యాగ్ బహూకరిస్తున్న ఎంపీ జీవీఎల్ నర్సింహారావు

గాజువాక: డిజైర్ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు నిర్వహించిన వేసవి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చిన్నారులకు ఎంపీ జీవీఎల్ నర్సింహారావు చేతుల మీదుగా బహుమతులను, పౌష్టికాహార ప్యాకెట్లను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ బాధిత చిన్నారుల కోసం డిజైర్ సొసైటీ తీసుకుంటున్న శ్రద్ధ అభినందనీయమన్నారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో 71వ వార్డు కార్పొరేటర్ రాజాన రామారావు, బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, డిజైర్ సొసైటీ నిర్వాహకులు లక్ష్మణ్, రజని, స్థానిక నాయకులు పరశురామ్, బలిరెడ్డి సత్యనారాయణ, గూటూరు శంకరరావు, రోహిణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.